మూగ రోదన



- పశు వైద్యశాలలు మూడు... డాక్టర్ ఒక్కరే
- జీవాలకు వైద్యం అందక రైతుల అవస్థలు

గుంతకల్లు రూరల్: మండలంలో మూడు ప్రభుత్వ పశు వైద్యశాలలు ఉన్నా వైద్యుల కొరత వేధిస్తుండటంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇన్‌చార్జ్ వైద్యుల నియామకం చేపట్టినప్పటికీ అవసరమైన సమయంలో వారు అందుబాటులో లేకపోవడంతో రోగాల బారిన పడ్డ పశువులకు సరైన వైద్యం అందడం లేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్న పాడి రైతులు జేబులు గుల్ల చేసుకుంటున్నారు. 25 పంచాయతీలు, 39 గ్రామాలు ఉన్న గుంతకల్లు మండలంలో పాతకొత్తచెరువు గ్రామంలో ఒకటి, నాగసముద్రం గ్రామంలో మరొకటి రెండు ప్రభుత్వ పశువైద్యశాలలు ఉన్నాయి. గుంతకల్లు పట్టణ వాసుల కోసం మార్కెట్ యార్డులో ఒక పశువైద్యశాలను ఏర్పాటు చేశారు. మూడు పాయలుగా ఉన్న గుంతకల్లు మండలంలో గుత్తి-గుంతకల్లు జాతీయ రహదారిలో ఉన్నగ్రామాలకు పాతకొత్తచెరువు పశువైద్యశాల, గుంతకల్లు -నాగసముద్రం రహదారిలో ఉన్న గ్రామాలకు నాగసముద్రం పశువైద్యశాల అందుబాటులో ఉండగా కసాపురం- కొంగనపల్లి రహదారిలోని ఆరు గ్రామాల రైతులు చుట్టుతిరిగి పాతకొత్తచెరువు



గుంతకల్లు పట్టణంలోని పశు వైద్యశాల

లేదా పట్టణంలోని పశువైద్యశాలకు రావాల్సిన పరిస్థితి. నాగసముద్రం పశువైద్యశాలకు రెగ్యులర్ వైద్యుడిగా ఉన్న మహేష్‌ను పాతకొత్తచెరువు పశువైద్యశాల ఇన్‌చార్జ్‌గా నియమించారు. నాగసముద్రం పశువైద్యశాల నిత్యం బిజీగా ఉండటంతో ఆయన వారంలో ఒకటి లేదా రెండు సార్లకు మించి పాతకొత్తచెరువు పశువైద్యశాలను సందర్శించలేకపోతున్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉన్న పశువైద్యశాలకు ఉరవకొండ ఏడీ డాక్టర్ పెద్దన్నను ఇన్‌చార్జ్ వైద్యుడిగా, విడపనకల్లు వెటర్నరీ వైద్యుడు నరేష్‌కుమార్‌ను వర్క్ అరేంజ్‌మెంట్ పద్ధతిలోనూ నియమించినప్పటికీ అక్కడా అదే పరిస్థితి. దీంతో అటు పాతకొత్తచెరువు, ఇటు పట్టణంలోని పశువైద్యశాలల్లో వైద్యుల కొరత పాడిరైతులను తీవ్రంగా వేధిస్తుంది. ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు కొద్దిమేర వైద్యం చేయగలిగినప్పటికీ పూర్తిస్థాయిలో వారు వైద్యసేవలను అందించలేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి ఎంతో కష్టపడి ఆసుపత్రులకు చేరుకుంటున్న రైతులు అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకుగురవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేటు పశువైద్యులను సంప్రదించి జేబులు గుల్ల చేసుకుంటున్నారు.

వేసవిలో పశువులకు వడదెబ్బ ముప్పు...

వేసవి కాలంలో ఎక్కువగా గొర్రెలు, కోళ్లు తరచూ బొబ్బరోగం బారిన పడటం, గొంతువాపుతో గొర్రెలు మేత మేయలేక నీరసించి పోవడం వంటి రోగాలు ఎక్కువవుతాయి. వీటికి తోడు మండే ఎండల కారణంగా ఆవులు, ఎద్దులు, ఎనుములు వడదెబ్బ బారినపడి మృతిచెందే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది ఫిబ్రవరి మొదటివారంలోనే ఎండలు తీవ్ర రూపం దాలుస్తుండటంతో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు ఏ స్థాయిలో ఉంటాయో ఊహించుకోవడానికే భయమేస్తుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి ఖాళీగా ఉన్న పశువైద్యుల నియామకాలను చేపట్టి పశువుల ఆరోగ్యానికి భరోసాను కల్పించాలని పాడి రైతులు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది..



ఏడు ఎనుములతో పాల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. మా గ్రామంలో పశువైద్యశాల ఉన్నప్పటికీ అక్కడ డాక్టర్‌ను నియమించకపోవడంతో ఆసుపత్రిలో ఉన్న సిబ్బందితోనే ఎనుములకు వైద్యం చేయిస్తున్నాను. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు అయితే పరవాలేదు, తీవ్రమైన అనారోగ్యం బారిన పడితే చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఎంతోడబ్బు ఖర్చుపెట్టుకుని ప్రైవేటు వైద్యులను పిలిపించాల్సి వస్తోంది. **– మారుతీ లక్ష్మి, పాడిరైతు, పాతకొత్తచెరువు**

వైద్యులు లేకపోతే ఎలా..



పశువైద్యశాల ఉందనేమాటే గానీ ఇక్కడ రెగ్యులర్ వైద్యుడు లేడు. వారానికి ఒకటి రెండు సార్లు వచ్చి వెళ్లే ఇన్‌చార్జ్ వైద్యులు ఉన్నప్పటికీ వారు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో ఎవరికీ తెలీదు. అనారోగ్యం భారిన పడిన పశువులను తీసుకొచ్చిన ప్రతిసారీ ఇక్కడ సిబ్బందే వైద్యం చేస్తారు. గత్యంతరం లేక మేము కూడా సిబ్బందితోనే వైద్యం చేయిస్తున్నాము. వైద్యుడే లేకపోతే ఆసుపత్రి ఉండి మాత్రం ఏం ప్రయోజనం. **– రాఘవేంద్ర, పాడి రైతు, గుంతకల్లు**

వారానికి రెండు సార్లు వెళ్తుంటాను...



నాగసముద్రం పశువైద్యశాలకు రెగ్యులర్ వైద్యుడిగా ఉన్న నన్ను పాతకొత్తచెరువు పశువైద్యశాలకు ఇన్‌చార్జ్ వైద్యుడిగా నియమించారు. నాగసముద్రం చుట్టుపక్కల ఆరు గ్రామాల నుండి వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న పశువులతో వచ్చే పాడి రైతులతో నిత్యం ఆసుపత్రి బిజీగా ఉంటుంది. దీంతో ఎక్కువశాతం నాగసముద్రం ఆసుపత్రిలోనే ఉండాల్సి వస్తుంది. అయినప్పటికీ వారానికి రెండు సార్లు, అత్యవసర పరిస్థితుల్లోనూ పాతకొత్తచెరువు ఆసుపత్రికి వెళ్తుంటాను. **– మహేష్, మండల పశువైద్యాధికారి**

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ ఈరన్న



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ శ్రీనివాసులు

యాడికి: వాహన డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సీఐ ఈరన్న హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి దేవాలయం ముంగిట ఆటో డ్రైవర్లు, ఐచర్, బొలేరో వాహనాల డ్రైవర్లతో రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, లగేజీ వాహనాలు అధిక లోడుతో వెళ్లరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు ఎంవీఐ శ్రీనివాసులు అవగాహన కల్పించారు. విద్యార్థులు ర్యాష్ డ్రైవింగ్ చేయరాదన్నారు. త్రిబుల్ డ్రైడింగ్ వల్ల ప్రమాదాలకు గురికావాల్సి ఉంటుందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

కొండమీద రాయుడి హుండీ కానుకల లెక్కింపు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సిద్ధరాంపురం రోడ్డు సమీపాన వెలసిన కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి హుండీ కానుకలను గురువారం లెక్కించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవరకొండపై తాత్కాలిక హుండీలను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కానుకలు, ముడుపులు సమర్పించారు. వీటిని దేవరకొండపై కొండమీద రాయుని ఆలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. ఈసందర్భంగా హుండీల్లో రూ.3,31,891 ఆదాయం వచ్చింది. అలాగే భక్తులు ఇచ్చిన చందాలు రూ.65,770, కల్యాణ కానుకలు రూ.19,508లు కలిపి మొత్తం రూ.4,17,169 వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఈఓ రమేష్‌బాబు, ఆలయ ధర్మకర్త నారాయణస్వామి, చంద్రకాంత్, అర్చకులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని యంగన్నపల్లి గ్రామ శివారులో గురువారం వేకువజామున ద్విచక్రవాహనం అదుపు తప్పి రాము, లాలుస్వామి అనే ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. బేతాపల్లికి చెందిన వారు ద్విచక్రవాహనంలో తొండపాడు గ్రామంలో తిరునాలకు వెళ్లి సొంతూరుకు వెళ్తుండగా బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురంకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై దాడి

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో గురువారం ఓ స్థల వివాదంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో ఒక వర్గానికి చెందిన వృద్ధురాలు మహబూబ్ బీ గాయపడ్డారు. స్థలం వివాదంలో మహబూబ్ బీపై అదే కాలనీకి చెందిన బాషాతో పాటు మరో ఐదుగురు దాడి చేశారు. గాయపడిన ఆమెను బంధువులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దివ్యాంగ పిల్లల గుర్తింపు క్యాంపైన్

పామిడి: మండలంలోని ఎద్దులపల్లిలో గురువారం ఆ గ్రామ పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో బుద్ధి మాంద్య, అంగవైకల్య పిల్లల గుర్తింపు క్యాంపెయిన్ చేపట్టారు. హైకోర్టు ఆదేశాల మేరకు గుత్తి అరవ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి ఉత్తర్వులతో క్యాంపెయిన్ నిర్వహించారు. ప్యానల్ లాయర్ సూర్యనారాయణ పారా లీగల్ వలంటీర్లు మధు, సూర్యనారాయణ, ఇస్మాయిల్ , ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామానికి చెందిన గొల్ల ప్రసాద్ (70) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... మద్యానికి బానిసైన ప్రసాద్‌ను తాగుడు అలవాటు మానేయాలని కుటుంబసభ్యులు పలుమార్లు మందలిస్తూ వచ్చారు. రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలో అతిగా మద్యం సేవించాడు. కుమారులు గురువారం ఆయనను తీవ్ర స్థాయిలో మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లో ఉన్న విషపు గుళిలు మింగాడు. అపస్మారకస్థితికి చేరుకున్న ఆయనను కుటుంబసభ్యులు గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ప్రసాద్ మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వాహనాల తనిఖీ

శింగనమల/గార్లదిన్నె: శింగనమల పోలీస్‌స్టేషన్ ఎదుట గురువారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలకు రికార్డులు సక్రమంగా ఉండాలని ఎస్‌ఐ విజయకుమార్ సూచించారు. అలాగే గార్లదిన్నె డ్యాం రోడ్డు సర్కిల్లో శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ బాషా, సిబ్బంది వాహనాలు తనిఖీ చేశారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి



అనంత వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న క్రిస్టియన్ మైనార్టీ నాయకులు

గుత్తి: క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం అనంతను ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.ప్రసాద్ బాబు, అనంతపురం క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు సతీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనంతను సన్మానించారు. అనంత వెంకరామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్రైస్తవులకు ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజల పక్షాన పోరాడాలన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ విభాగం గుంతకల్లు అధ్యక్షుడు కిరణ్, తాడిపత్రి అధ్యక్షుడు సునీల్, పాస్టర్లు బిషప్ వాసు అనిల్ కాంత్, అబ్రహాం, సాల్మన్ రాజ్, జాకబ్, మనీషా, సునీల్ కుమార్, సతీష్, థామస్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రైల్వే హైస్కూల్ వార్షికోత్సవం

గుంతకల్లు: పట్టణంలోని రైల్వే హైస్కూల్ 43వ వార్షికోత్సవం గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తా, ఏడీఆర్‌ఎం యు.సుధాకర్, సీనియర్ డీపీఓ క్యాప్రిల్ అరోరా, సీనియర్ డీఈఎన్ కోర్డినేషన్ జీబీఎస్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రంగోళి క్యాంపిటేషన్‌ను ఏర్పాటు చేశారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం డీఆర్‌ఎం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా పోటీతత్వం అలవర్చుకున్నప్పుడే మరింత రాణించగలన్నారు. త్వరలో జరిగే 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌సీఆర్‌డబ్ల్యూడబ్ల్యూ ఆర్గనేజషన్ గుంతకల్లు డివిజన్ అధ్యక్షురాలు, డీఆర్‌ఎం సతీమణి మమతగుప్తా, హైస్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ డీసీఎం మనోజ్

గుంతకల్లు: రైల్వేస్టేషన్లలో వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులకు సీనియర్ డీసీఎం మనోజ్ సూచించారు. రైల్వే స్టేషన్లలో వసతుల కల్పన అంశంపై గురువారం స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో డివిజన్ పరిధిలోని 9 సెక్షన్ల కమర్షియల్ సిబ్బందితో ఆయన సమీక్షించారు. రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు, ఉద్యోగులకు కావాల్సిన మౌలిక వసుతులపై ఆరా తీశారు. ఆదాయ వనరుల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో డీసీఎం శ్రీకాంత్‌రెడ్డి, ఏసీఎం ధనుంజయ్య, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రేపు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రథోత్సవం



గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి రథోత్సవం నిర్వహించనున్నారు.ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తిచేశారు. రథోత్సవం తిలకించడానికి చుట్టు ప్రక్కల గ్రామాలు, జిల్లా నలుమూలాల నుంచి కాక ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రం నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. రాత్రి 8 గంటలకు రథోత్సవం ప్రారంభం కానుంది. ఆదివారం ఉదయం సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామి ఆలయంలో శ్రీవల్లి, దేవసేన శ్రీవారి కల్యాణం ఉంటుంది. అలాగే అనంతపురం నుంచి కోటంక ఆలయం వరకూ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రం ఏర్పాటు చేశారు.

ప్రభుత్వం వాగ్దానం నిలబెట్టుకోవాలి

తాడిపత్రి: అధికారంలోకి వస్తే ఇల్లులేని నిరుపేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, పల్లెల్లో 3 సెంట్లు స్థలం కేటాయిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం వాగ్దానాన్ని నేరవేర్చుకోలేదని సీపీఐ నాయకులు మండిపడ్డారు. 8వ వార్డులో సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి ఆధ్వర్యంలో ఇంటి స్థలం కోసం అర్హులైన వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణంలో ఒక సెంటు, పల్లెల్లో ఒకటిన్నర సెంటును ఇల్లులేని నిరుపేదలకు ప్రభుత్వం ఉచితంగా కేటాయించిందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజారెడ్డి మాట్లాడుతూ తాడిపత్రి ప్రాంతంలో ఇల్లులేని నిరుపేదలు చాలా మంది ఉన్నారని, వారి కోసం సీపీఐ ఒక ఉద్యమం చేపట్టిందన్నారు. పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇసుక, కడ్డీలు, కంకర ఉచితంగా ఇవ్వాలని చేసిన డిమాండుపై క్యాబినేట్‌లో తీర్మానం చేసిన చంద్రబాబు వెంటనే అమలు చేయాలని డిమాండు చేశారు. హామీలు నెరవేర్చకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శులు శ్రీరాములు, రామాంజి, శివ నరేష్, రఘునాథ్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలందించండి

శింగనమల: గ్రామ సచివాలయాల్లో పని చేసే సిబ్బంది ప్రజలకు సేవలందించాలని ఎంపీడీఓ భాస్కర్ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నాయని, చిన్న పిల్లల ఆధార్ కార్డు నమోదు, తదితర వాటిపై చర్చించారు. పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు సరైన సేవలందించపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి అద్దాల పంపిణీ

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్లో శుక్రవారం విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఈరమ్మ పేర్కొన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ వినోద్ కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. నోడల్ అధికారిగా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమానికి వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

జగన్‌ను కలసిన నాయకులు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన మండల నాయకులు

పెద్దవడుగూరు: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి లక్కు రామచంద్రారెడ్డి, దిమ్మగుడి మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి తదితరులు గురువారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా తాడిపత్రి నియోజక వర్గం రాజకీయ పరిస్థితులను గురించి చర్చించినట్లు వారు తెలిపారు. నాయకులు బ్రహ్మానందరెడ్డి, సుబ్బు ఆచారి, వెంకట్, లక్ష్మంపల్లి హరికృష్ణారెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శేషారెడ్డి

పుట్లూరు: రైతు సేవా కేంద్రాల పరిధిలో వ్యవసాయ సిబ్బంది తమ పరిధిలోని రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీ త్వరితగతిన చేయాలని ఏడీఏ చెంగళరాయుడు సూచించారు. గురువారం ఆయన మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తో పాటు కంది పంటను సాగు చేసిన రైతులు తమ దిగుబడిని విక్రయించడానికి యాప్‌లో రిజిస్టర్ చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ శేషారెడ్డి మాట్లాడుతూ రబీలో పంట నమోదు చేసిన ప్రతి రైతు నుంచి ఈ-కేవైసీ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఏఓ కాత్యాయని, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

పుట్లూరు: మండలంలోని కొండాపురం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కోసం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఎస్‌ఆర్‌ఐటీ ప్రొఫెసర్‌కు గౌరవ డాక్టరేట్



అనిల్‌కుమార్‌ను అభినందిస్తున్న కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలల అధాపకుడికి మద్రాస్ ఐఐటీ ప్రతినిధులు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ తెలిపారు. ఎస్‌ఆర్ఐటీ కళాశాలలో హ్యూమానిటీస్, సైన్సెస్ విభాగంలో ఆంగ్ల అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్ ఐఐటీ మద్రాస్‌లోని హెచ్‌ఎస్‌ఎస్ విభాగం ప్రొఫెసర్ ఎస్పీ ధనవేల్ పర్యవేక్షణలో అప్‌లేడ్ లింగ్విస్టిక్స్‌లో ప్రత్యేకత కలిగిన ఈఎల్‌టీలో పరిశోధనను నిర్వహించారు. ఇందుకు ఏఐసీటీఈ సంయుక్తంగా క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (క్యూఐపీ), ఎస్‌ఆర్‌ఐటీ స్వయంప్రతిపత్తి కింద అనిల్‌కుమార్‌ను పరిశోధనను స్పాన్సర్ చేసిందన్నారు. గౌరవ డాక్టరేట్‌ను పొందిన అనిల్‌కుమార్‌ను కళాశాల కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి, టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి అభినందించారు.

పెంచిన మద్యం ధరలను ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న ఐద్వా, సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: కూటమి ప్రభుత్వం పెంచిన మద్యం ధరలను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి డిమాండ్ చేశారు. మద్యం ధరల పెంపును వ్యతిరేకిస్తూ గురువారం సీపీఎం, ఐద్వా ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారంలోకి వస్తే మద్యం ధరలు తగ్గిస్తామని నమ్మబలికి ఇప్పుడు మోసం చేయడమేంటని వారు ప్రశ్నించారు. అలాగే సమయ పాలన పాటించని మద్యంషాపు లీజుదారులపై చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ అధ్యక్షురాలు జ్యోతి, డీవైఎఫ్ఐ కార్యదర్శి సురేంద్ర, ఐద్వా నాయకురాళ్లు జయమ్మ, లక్ష్మీబాయి, షాకీరా తదితరులు పాల్గొన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ రాక

గుంతకల్లుటౌన్: హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సర్వైకల్ సర్జరీ చేయించుకుని వైద్యుల సూచన మేరకు కొంతకాలం విశ్రాంతి తీసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి శుక్రవారం గుంతకల్లుకు రానున్నారు. ఈ సందర్భంగా తమ అభిమాన నేత వైవీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు నియోజకవర్గంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 1:30 గంటలకు గుత్తిబాట సుంకులమ్మ ఆలయంలో వైవీఆర్ పూజలు నిర్వహించిన అనంతరం అక్కడి నుంచి గుత్తి మీదుగా గుంతకల్లు వరకూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అట్టడుగు వర్గాలు అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు: అట్టడుగు వర్గాలు సమాజంలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఉపయోగపడడానికి కులగణన అవసరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కులగణన అవశ్యకతపై వివిధ కులసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక, తెలంగాణ, బిహార్ తరహాలో కులగణన చేపట్టాలన్నారు. సంక్షేమ ఫలాలతోపాటు రాజకీయంగా ఎదుగుదలకు కులగణన ఎంతో దోహదపడుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వ కులగణన దామాషా ప్రకారం స్థానిక సంస్థలో బీసీలకు 47 శాతం రిజర్వేషన్ అవకాశం కల్పిస్తున్నట్లు తీర్మానం చేశారన్నారు. అదేతరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా వెంటనే కులగణన చేపట్టి బీసీలకు 50 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు వీరభద్రస్వామి, గోపీనాథ్, రజక సంఘం రాష్ట్ర నాయకులు దేవేంద్ర, మైనార్టీ నాయకుడు మాబు, బలిజ సంఘం నాయకుడు పూలరమణ, కురబ సంఘం నాయకులు సోమశేఖర్, లింగన్న, రామప్ప, వాల్మీకి సంఘం నాయకుడు సూర్యనారాయణ, బీఎస్పీ నాయకుడు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం..

గుత్తి రూరల్: మండలంలోని అనగానదొడ్డి గ్రామంలో గురువారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పోతుల కృష్ణయ్య, మూలింటి రంగన్న, రామాంజనేయులు అనే రైతులకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. బాధిత రైతులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతులు పోతుల కృష్ణయ్య, మూలింటి రంగన్న, రామాంజనేయులు వేరుశనగ, కంది, జొన్న పంటలు సాగు చేసి తొలగించిన అనంతరం పశువులకు గ్రాసం కోసం పొలంలో వాములు వేసి ఉంచారు. అలాగే నంద్యాలలో వరిగడ్డి కొనుగోలు చేసి రైతులు గ్రామ శివారులోని తమ పొలాల పక్కన వరుసగా వాములు వేసి ఉంచారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు సిగరేట్ తాగి పడేయడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. గుంతకల్లు అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపుచేసేలోగా పశుగ్రాసం కాలిపోయింది. దాదాపు రూ.5లక్షలు నష్టం వాటిల్లడంతో పాటు పశువులకు గ్రాసం లేకుండా పోయిందని రైతులు విలపించారు. ఆదుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు బాధిత రైతులు ఫిర్యాదు చేశారు.

సీనియర్ అకౌంటెంట్‌గా పదోన్నతి

శింగనమల: శింగనమల సబ్ ట్రెజరీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సతీష్ కమార్ సీనియర్ అకౌంటెంట్‌గా పదోన్నతి పొందడంతో గురువారం ఎస్‌టీఓ, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్‌గా మడకశిర ఎస్‌టీఓ కార్యాలయాలని ఆయన బదిలీ అయ్యారు. ఎస్‌టీఓ నారాయణరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ పవన్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.